సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 16 । జూలై । 2024



శ్రీవారి సేవలో ఏలూరు ఎస్పీ

ద్వారకాతిరుమల: చిన వెంకన్న క్షేత్రాన్ని సోమవారం ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



చేప రైతు 'ధర'హాసం

పది రోజులుగా చేపల ధరలు పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అన్ని రకాల చేపల ధరలు పెరుగుతుండటంతో ఆక్వాపై ఆశలు చిగురిస్తున్నాయి. 8లో ▸



ఆదమరిస్తే షాకే !

వర్షాకాలంలో రైతులు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో స్విచ్‌బోర్డులు, తెగిపడిన తీగలతో ప్రమాదాలు జరుగుతాయన్నారు. 8లో ▸

నిరుద్యోగ భృతి.. అంతా భ్రాంతి!

- నిరుద్యోగులకు నెలకు రూ.3,000 ఇస్తామని కూటమి హామీ
- పాలన చేపట్టి నెల రోజులు దాటినా నిరుద్యోగ భృతిపై స్పష్టత కరువు
- గత అనుభవాల నేపథ్యంలో నిరుద్యోగుల్లో ఆందోళన
- వెంటనే అమలు చేయాలని డిమాండ్
- అప్పులు చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధం
- 2019–24 మధ్య జిల్లాలో 15 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించిన జగన్ ప్రభుత్వం

> ఏపీలోని యువతను ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అనుసంధానం చేస్తాం.. పరిశ్రమలు తెస్తాం.. ఉద్యోగాలిస్తాం.. అంతేకాదు మీకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటాను.
>
> – సార్వత్రిక ఎన్నికల సభల్లో చంద్రబాబు

సూపర్ సిక్స్‌లో నిరుద్యోగులకు పెద్దపీట వేశాం.. ఉపాధి, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమిస్తాం.. అప్పటివరకు నిరుద్యోగులకు భృతి అందిస్తాం.. అంటూ కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులైనా నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు. వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయినా నిరుద్యోగ భృతి హామీపై మాట్లాడకపోవడం నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. జిల్లాలోని 5.17 లక్షల కుటుంబాలు ఎన్నికల వాగ్దానం అమలు కోసం ఎదురుచూస్తున్నాయి.

సాక్షి, భీమవరం: ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఉద్యోగాల కల్పన, అంతవరకు ప్రతి నెలా ఇస్తామన్న భృతి హామీల అమలుకు నిరుద్యోగ యువత, వారి తల్లిదండ్రులు గంపెడాసలతో ఎదురుచూస్తున్నారు. రూ.3,000 తమకు ఎంతో ఆసరా అవుతాయని వారంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం హామీల అమలుపై ఏమీ మాట్లాడకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతూ..

డీఎస్సీ, గ్రూపు పరీక్షలు, పోలీస్ రిక్రూట్‌మెంట్, ఏపీపీఎస్సీ తదితర వాటి ద్వారా ప్రభుత్వ కొలువుల కోసం జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లోని కోచింగ్ సెంటర్లలో, ఇంటి వద్ద ప్రిపేర్ అవుతున్న వారు సుమారు 30 వేల మంది వరకు ఉంటారని అంచనా. అలాగే విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తదితర నగరాల్లో ఉంటూ శిక్షణ పొందుతున్న వారు మరెందరో. వీరంతా వేలు, లక్షల్లో ఫీజులు చెల్లించి శిక్షణ తీసుకుంటున్నారు. తమ బిడ్డల భవిష్యత్తు కోసం అయినకాడికి అప్పులు చేసి శిక్షణ ఇప్పిస్తున్న తల్లిదండ్రులు ఎందరో. హాస్టల్, మెస్ నిమిత్తం వీరికి నెలకు రూ.6 వేలకు పైగా ఖర్చవుతోంది. మరోపక్క డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర పై చదువులు చదువుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితులతో చాలీచాలనీ జీతంపై వ్యాపార, ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్న వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. వీరిలో ఎంతోమంది తమ చదువుకు తగిన ఉద్యోగం కోసం వేచి చూస్తున్నారు.




అందరికీ వర్తింపజేయాలి

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 42 ఏళ్లు, రిజర్వు కేటగిరీ అభ్యర్థులకు ఐదేళ్ల అదనపు వెసులుబాటు ఉంటుంది. ఈ మేరకు ఇంటర్ నుంచి 47 ఏళ్ల వయసును పరిగణనలోకి తీసుకుని కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అమలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

అనుమానాలు రేకెత్తిస్తున్న గత అనుభవాలు

నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని ఎన్నో ఏళ్లుగా చంద్రబాబు చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో రూ.2,000 చొప్పున ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల పాటు ఆ ఊసే ఎత్తలేదు. నాటి విపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో 2019 ఎన్నికలకు ఆరు నెలల ముందు యువనేస్తం అంటూ నామమాత్రంగా కొందరికి అందించారు. అప్పట్లో జిల్లాలో లక్ష మందికి పైగా నిరుద్యోగులు ఉంటే సుమారు 6 వేల మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. ఇంటికో ఉద్యోగం అని నమ్మించి గోపాలమిత్ర, ఆరోగ్యమిత్ర, ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగాలకు ఎసరుపెట్టారు. 2014–2019 కాలంలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 34,108 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారు. ఇదిలా ఉండగా 2019–2024 కాలంలో వైఎస్ జగన్ ప్రభుత్వం జిల్లాలో శాశ్వత, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో 15 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించింది. ఒక్క సచివాలయాల ద్వారా 4,230 మంది ప్రభుత్వం కొలువులు పొందారు. ఈ నేపథ్యంలో గత అనుభవాల దృష్ట్యా నిరుద్యోగ భృతి అమలుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



జిల్లాలో 5.17 లక్షల కుటుంబాల ఎదురుచూపులు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. నేను డిగ్రీ చేశాను. ఉద్యోగం లేదు. ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.3 వేలు భృతి కల్పించి హామీని నిలబెట్టుకోవాలి.

– తాడిపర్తి బాబ్జి, కొమ్మర, అత్తిలి మండలం

గతంలోనూ ఇలాగే..



ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా నిరుద్యోగ భృతి ఊసెత్తడం లేదు. హామీ అమలులో తాత్సారం చేస్తున్నారు. గతంలోనూ ఇలాగే నిరుద్యోగ భృతి ఇవ్వకుండా గడిపేశారు. నిరుద్యోగులు భృతి కోసం ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు మాట నిలుపుకుని నిరుద్యోగులను ఆదుకుంటారని ఆశిస్తున్నా.

– కాసాని రాజేష్, మొగల్తూరు

ఇప్పటికీ స్పష్టత లేదు



అధికారంలోకి రాక ముందు జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అంటూ చంద్రబాబు ప్రకటించారు. అధికారంలోకి వచ్చి నెలరోజులు దాటినా నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదు. లక్షలాది మంది ఉద్యోగాలు లేక నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని జాప్యం లేకుండా అమలు చేయాలని కోరుతున్నాం.

– వేగి బాబి, శేరేపాలెం, మొగల్తూరు మండలం

ఊసే ఎత్తడం లేదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉపాధి కల్పిస్తామని లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ప్రభుత్వం ఏర్పడినా ఆ ఊసే లేకుండా పోయింది. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇప్పించి నిరుద్యోగులను ఆదుకోవాలి. అలాగే హామీలన్నీ అమలుచేయాలి.

– షేక్ జిలానీ, తణుకు

నిరుద్యోగులతో ఆటలొద్దు



నిరుద్యోగుల అసహాయ స్థితిని అలుసుగా తీసుకోవద్దు. ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ కూటమి పార్టీల నేతలు హడావుడి చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదు. నిరుద్యోగులను మళ్లీ మోసగించొద్దు. ముఖ్యంగా పేదలైన నిరుద్యోగులతో ఆటలాడుకోవద్దు.

–గొంతే హరీష్, పాందువ్వ, ఉండి మండలం

జాబ్ క్యాలెండర్ ఎప్పుడు..



నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. నేను బీటెక్ పూర్తిచేశాను. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికీ ఉద్యోగం లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగం వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్నా. అయితే ఇప్పటివరకు జాబ్‌క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై ఎటువంటి స్పష్టత లేదు.

– రేవు నాగబాబు, దొంగపిండి, భీమవరం మండలం

తక్షణమే అమలు చేయాలి



కూటమి అధికారంలోకి వస్తే ప్రతి ఇంట్లో యువతకు ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 30 రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ హామీపై స్పష్టత లేదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణమే కూటమి ప్రభుత్వం నెరవేర్చాలి. అలాగే అన్ని హామీలు అమలుచేయాలి.

– కె.సాయి జగదీష్, నిరుద్యోగి, తాడేపల్లిగూడెం

నోరు మెదపరేం



ప్రభుత్వం ఏర్పడి నెల రోజులైనా భృతిపై ఎందుకు మాట్లాడటం లేదు. జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అమలుపై స్పష్టత ఇవ్వాలి. నిరుద్యోగులంతా నెలకు రూ.3 వేలు భృతి అందుతుందని ఎదురుచూస్తున్నారు. వెంటనే హామీని అమలు చేయాలి. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఊదరగొట్టి నోరు మెదపరేం.

– కంకటాల పెద్దిరాజు, సారవ, నరసాపురం మండలం

న్యూస్‌రీల్

టీడీపీ నాయకుల ఆరోపణలు అవాస్తవం



ములపర్రులో ఏపీడీకి విన్నవించుకుంటున్న ఉపాధి కూలీలు

పెనుగొండ: ఉపాధి హామీ పథకం ములపర్రు ఫీల్డ్ అసిస్టెంట్ పితాని వీర వెంకట సత్యనారాయణపై టీడీపీ నాయకులు కుట్రతో ఫిర్యాదు చేశారంటూ, వారి ఆరోపణలు అవాస్తవమని ములపర్రు ఉపాధి హామీ కూలీలు ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పితాని వీర వెంకట సత్యనారాయణపై టీడీపీ నాయకులు ఆరోపణల నేపథ్యంలో తణుకు ఏపీడీ పి.సురేష్ బాబు సోమవారం విచారణ చేపట్టారు. విచారణాధికారి వద్దకు ఉపాధి కూలీలు, మేస్త్రీలు అధిక సంఖ్యలో చేరుకుని ఆరోపణలు అవాస్తవమంటూ వివరణ ఇచ్చారు. రాజకీయ కక్షతో ఆరోపణలు చేస్తున్నారంటూ విమర్శించారు. ఉపాధి కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ అండగా నిలిచారంటూ ఏపీడీకి వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ పితానిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఏపీడీ సురేష్ బాబు తెలిపారు.

26 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపు



ప్రిన్సిపాల్స్‌తో చర్చిస్తున్న డీఆర్వో

భీమవరం: ఉన్నతమైన విద్యాబోధనతో విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశమై కాంట్రాక్ట్ అధ్యాపకుల బదిలీలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాల స్థాయిలో ఉద్యోగావకాశాలు వస్తే వారు ఆర్థికంగా మెరుగైన రీతిలో ఉండటంతో పాటు కుటుంబానికి ఆసరాగా నిలుస్తారన్నారు. కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందేలా ప్రోత్సహించాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, నైపుణ్యాభివృద్ధికి సూచనలు చేయాలన్నారు. జిల్లాలోని ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 26 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల సర్వీస్ కొనసాగింపునకు చర్యలు తీసుకుంటున్నట్టు డీఆర్వో తెలిపారు. డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సులభంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు

సాక్షి, విశాఖపట్నం: కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కావల్సిన రైతులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయవచ్చని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని మీ–సేవా కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. అయితే ఆయా కార్యాలయాల్లో కొత్త వ్యవసాయ కనెక్షన్ల నమోదు విషయంలో పత్రాలను అప్‌లోడ్ చేసే సమయంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందుకే రైతులు నేరుగా 1912 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు తమ ఆధార్, రిజిస్టర్డ్ ఫోన్ నంబర్, పట్టాదార్ పాస్‌బుక్, సర్వే నంబర్, వాల్టా సర్టిఫికెట్ నంబర్, కులధ్రువీకరణ పత్రం వంటి వివరాలను తెలియజేయాలని సూచించారు.

విద్యుత్ సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు జూనియర్ అకౌంట్స్ అధికారులు (జేఏఓ)గా పదోన్నతులు కల్పిస్తూ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిగూడెం ఈఆర్‌ఓలో సీనియర్ అసిస్టెంట్ ఎస్.వేణుగోపాల్‌ను తణుకు జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా, భీమవరం ఈఆర్‌ఓలో పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరాజును భీమవరం జేఏఓగా, నిడదవోలు ఈఆర్‌ఓలో పనిచేస్తున్న టీఎల్ చంద్రకళను ఏలూరు టౌన్ జేఏఓగా, తాడేపల్లిగూడెం ఈఆర్‌ఓలో పనిచేస్తున్న యూవీవీ భాస్కరరావును నిడదవోలు జేఏఓగా నియమించారు.

వేధింపులు దారుణం

ఏలూరు (టూటౌన్): మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులు, తొలగింపులు అరికట్టాలని కోరుతూ ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

- 'మీ కోసం'లో 129 అర్జీల స్వీకరణ
- కలెక్టర్ నాగరాణి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజల సమస్యలను సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. మీ కోసంలో ప్రజల నుంచి 129 అర్జీలను స్వీకరించామన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పాలకోడేరు మండలం గొల్లకోడేరుకు చెందిన వీరవల్లి బాలకృష్ణ తన తండ్రి ముత్యాలరావుకు చెందిన భూమికి సంబంధించిన చేసిన డ్రోన్ సర్వేలో భూమి స్వరూపాన్ని మార్చివేశారని, సమస్య పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.
- భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామానికి సంబంధించి రీ సర్వే భూముల రిజిస్ట్రేషన్ నిలిచిపోయాయని, వెంటనే రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలని అల్లూరి వెంకట నరసింహరాజు, చేకూరి వెంకట నరసింహరాజు అర్జీ అందజేశారు.
- వీరవాసరం మండలం తోకలపూడిపాలెం గ్రామానికి చెందిన పిల్లి సీతారామయ్య తన పాడి గేదెపై కొందరు దాడి చేసి హింసించారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.
- జిల్లాలోని ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కలెక్టర్‌ను కలిసి తమ పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలని, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు.
- యలమంచిలి మండలం మేడపాడుకి చెందిన తోట వీరభద్రరావు తన 10 ఏళ్ల కుమార్తెకు అనారోగ్య సమస్యల కారణంగా ఆందోళనగా ఉందని వాపోయారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ కీర్తిని ఆదేశించారు.
- మొగల్తూరుకి చెందిన సఖినేటిపల్లి ముత్యాలరావు తన గ్రామ పరిధిలోని వయడ్యర్ పేటలో కొందరు అక్రమ లేఅవుట్ వేశారని, కొనాయికోడును ఆక్రమించి రోడ్ల నిర్మాణం చేపట్టారని ఫిర్యాదు చేశారు.

మహిళా సాధికారతతో దేశ ప్రగతి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సి నాగరాణి

పాలకోడేరు: మహిళల ఆర్థిక ఎదుగుదల వారి కుటుంబంతో పాటు దేశ ప్రగతికి ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం పాలకోడేరు మండల సమాఖ్య భవన్‌లో 20 మండలాల సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, డీపీఎంలతో ఆమె సమావేశం నిర్వహించారు. మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుని ఎదగాలన్నారు. నూరు శాతం రుణాల రికవరీకి చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో గ్రామ సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం ద్వారా మేలైన పంటలను పండించి లాభాలు పొందవచ్చన్నారు. పాలకోడేరు, అత్తిలి, ఉండిలో మహిళా మార్టుల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ మాట్లాడుతూ తణుకులో ఏర్పాటుచేసిన అన్న సంజీవిని షాపు సుమారు రూ.5 లక్షల టర్నోవర్‌తో నెలకు రూ.50 వేల నికర ఆదాయాన్ని సాధిస్తుందన్నారు. అత్తిలి మండలం మంచిలిలో మహిళా సమాఖ్య సభ్యులు పూత రేకులు, సోంపాపిడి, చిక్కీల తయారీ ద్వారా లాభాలు గడిస్తున్నారన్నారు. డీపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో శిలాఫలకాల ధ్వంసం



దెందులూరు ఆర్‌బీకే, సచివాలయం గోడలకు ఉన్న శిలాఫలకాలను పగలగొట్టిన దృశ్యాలు

దెందులూరు : దెందులూరులోని ఎస్ఎంఆర్ నగర్‌లోని రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం గోడలకు ఉన్న శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి విధానాలు, దాడులు, దౌర్జన్యాలు తాము చూడలేదని, ఇలా చేయడం వల్ల ఏం ఒనగూరుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి చర్యలు వీడాలని, శిలాఫలకాలు పగులకొట్టడం, విగ్రహాలపై దాడులు సరికాదని అంటున్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం, పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2024కి జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ డాట్ ఎడ్యుకేషన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, గడువును ఈనెల 18 వరకు పొడిగించినట్టు చెప్పారు. పూర్తి ప్రతిపాదనలను ఈనెల 21లోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు.

ఇసుక కష్టాలు



అత్తిలిలో మధ్యలో నిలిచిన షెడ్డు నిర్మాణం

- జిల్లాలో తెరుచుకోని ర్యాంపులు
- పొరుగు జిల్లా నుంచి సరఫరా కాని వైనం
- నిబంధనల పేరుతో 'తూర్పు'లో అడ్డంకులు
- అవస్థలు పడుతున్న జిల్లావాసులు
- నిలిచిపోతున్న నిర్మాణాలు

అత్తిలి: ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన ఇసుక పాలసీతో జిల్లావాసులు ఇక్కట్లు పడుతున్నారు. జిల్లాలో ర్యాంపులు తెరుచుకోకపోవడంతో తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పందలపర్రు, పెండ్యాల, కుమారదేవం, తీపర్రు ర్యాంపుల నుంచి ఇసుక సరఫరా చేస్తామని అధికారులు ప్రకటించారు. అయినా పొరుగు జిల్లా నుంచి ఇసుక సరఫరా కావడం లేదు. నాలుగు రోజులుగా ఆయా ర్యాంపుల చుట్టూ వినియోగదారులు తిరుగుతున్నా అక్కడి అధికారులు రోజుకో నిబంధన పేరుతో ఇబ్బంది పెడుతున్నారు.

నిబంధనల పేరుతో.. ఇల్లు నిర్మించుకునేవారు ఉచిత ఇసుక కోసం పంచాయతీ ఇచ్చే ప్లాన్ అప్రూవల్, ఆధార్ కార్డు తీసుకురావాలని ప్రభుత్వం చెబుతోంది. దీంతో వీటిని తీసుకుని ర్యాంపుల వద్దకు వెళ్లగా అక్కడ అధికారులు కొత్తగా చెప్పే నిబంధనలతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. ఉచిత ఇసుక కేవలం తూర్పుగోదావరి జిల్లా వాసులకేనని, పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు ఇవ్వలేమని చెప్పడంతో ఇళ్లు కట్టుకునే వారు గగ్గోలు పెడుతున్నారు.

పేరుకే ఉచితం.. బ్లాక్‌లో విక్రయం

పేరుకు ఉచిత ఇసుక అయినా ర్యాంపుల వద్ద టన్ను రూ.270 ఉందని, తీరా వెళ్లినా అందుబాటులో ఉండటం లేదని పలువురు అంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత లేదని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ఇంటికే వచ్చేదని, ఇప్పుడు ఇసుక సరఫరా నిలుపుదల చేయడంతో పనులు ఆపుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. నూతన ఇసుక విధానంతో ఇసుక సరఫరా చేసే లారీలు సమ్మెలోకి వెళ్లాయి. గతంలో లారీ ఇసుక రూ.8 వేలు ఉండగా ఇప్పుడు బ్లాక్‌లో రూ.20 వేలు పలుకుతుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇసుక కొరతతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పశ్చిమగోదావరి జిల్లా వాసులకు కూడా సంబంధిత ర్యాంపుల నుంచి ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ర్యాంపుల చుట్టూ తిరిగినా ఫలితం లేదు



షెడ్డు నిర్మాణానికి సంబంధించి ఇసుక కోసం ఆధార్ కార్డు, పంచాయతీ అప్రూవల్ కాపీతో నాలుగు రోజులుగా ర్యాంపుల వద్దకు వెళుతున్నా ఫలితం లేదు. స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న ఇసుకను తూర్పుగోదావరి జిల్లా వాసులకే కేటాయిస్తున్నామని, పశ్చిమగోదావరి జిల్లావారికి ఇవ్వడం లేదని అక్కడ అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఎక్కడా కూడా ఇసుక ర్యాంపుల్లో ఇసుక విక్రయాలు లేవు. ఇసుక లేక నా షెడ్డు నిర్మాణం మధ్యలో నిలిపివేశాను. తీపర్రు, పెండ్యాల ర్యాంపుల నుంచి జిల్లావాసులకు ఇసుక సరఫరా చేసేలా అధికారులు చూడాలి.

– దిరిశాల మునేశ్వరరావు, వినియోగదారుడు, అత్తిలి

క్లుప్తంగా

మహిళా పోలీసు ఆత్మహత్య


వడ్డి భవాని(ఫైల్)

భీమవరం: కుటుంబ కలహాల నేపథ్యంలో భీమవరం పట్టణం 14వ వార్డులో సచివాలయ మహిళా పోలీసు ఆత్మహత్య చేసుకున్నట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు సోమవారం చెప్పారు. పట్టణంలోని 14వ వార్డు సచివాలయంలో మహిళ పోలీసుగా పనిచేస్తున్న వడ్డి భవాని(35) ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందిందన్నారు. మృతిరాలి భర్త మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తుండగా.. వారికి రెండున్నరేళ్ల పాప ఉంది. మృతిరాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో దగ్ధమవుతున్న బైక్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం జల్లేరు సమీపంలో టాటా మ్యాజిక్ వాహనం, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వెళ్తున్న కుంజా వీరా స్వామి తీవ్రంగా గాయపడగా, టాటా మ్యాజిక్ డ్రైవర్ బి.రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదస్థలంలో ద్విచక్ర వాహనం నుంచి పెట్రోల్ లీకయ్యి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటల్లో బైక్ పూర్తిగా దగ్ధమైంది.

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి


బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి కోరారు. తణుకులోని చిట్టూరి సుబ్బారావు, సత్య ఉషారాణి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 14 వరకూ జరిగిన జిల్లా చాంపియన్‌షిప్ పోటీల విజేతలకు సోమవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన క్రీడాకారులను బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మెంటే వంశీ కృష్ణ, ఉపాధ్యక్షుడు కంటిపూడి రాంబాబు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.సతీష్, కోచ్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చేప రైతు 'ధర'హాసం

- పది రోజులుగా పెరిగిన చేప ధర
- ఏడాదిగా ధర లేక నష్టాలు




చేపల పట్టుబడి చేస్తున్న దృశ్యం

గణపవరం: ఏడాదిగా ఆక్వా సాగు గిట్టుబాటు కాకపోవడంతో కుదేలైన రైతులు ఇప్పుడు కోలుకుంటున్నారు. చేప రేటు పెరగడంతో ఆక్వా సాగు నెమ్మదిగా గాడిన పడుతుంది. కొన్ని నెలలుగా చేప ధర దారుణంగా పడిపోవడం, మేతల ధరలు ఆకాశాన్నంటడం, నిర్వహణ ఖర్చులు పెరిగిపోవడంతో రైతుకు తీవ్ర నష్టాలు మిగిలాయి. పది రోజులుగా చేప ధర పెరుగుతుండటంతో రైతులు నష్టాల నుంచి బయటపడే అవకాశం ఏర్పడింది. చేపల సాగుకు విరమించుకుందామనుకున్న తరుణంలో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. కరోనా తర్వాత ఆక్వా రంగం కుప్పకూలిపోయింది. చేపకు ధర లేక, సాగు ఖర్చు పెరిగిపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పరిస్థితి మెరుగుపడుతుందన్న ఆశతో కొంతకాలంగా ఎదురు చూస్తున్న రైతులకు ఎట్టకేలకు చేప ధర పెరగడంతో మళ్లీ సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఎకరాకు రూ.లక్షకు పైగా నష్టం

గతంలో ఎకరాకు రూ.లక్ష వరకూ మిగిలేది. ఏడాది నుంచి ఎకరాకు రూ.లక్ష నష్టం వచ్చింది. ఏడాది క్రితం కిలో రూ.120 వరకూ పలికిన తెల్ల చేప ధర కిలో రూ.90కు, రూప్‌చంద్ కిలో రూ.105 నుంచి రూ.70కు పడిపోయింది. జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాలలో చేపల సాగు జరుగుతుండగా

జిల్లాలో చేపల సాగు
ఉమ్మడి జిల్లాలో ఆక్వా సాగు విస్తీర్ణం: 2.80 లక్షల ఎకరాలు
చేపల సాగు విస్తీర్ణం: 1.80 లక్షల ఎకరాలు
ఫంగస్, రూప్‌చంద్ సాగు: 70 వేల ఎకరాలు
తెల్ల చేప సాగు: 1.10 లక్షల ఎకరాలు

ఏడాది కాలంలో లక్ష ఎకరాలలో రూప్‌చంద్, తెల్ల చేపలను అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో రైతులు దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా నష్టపోయినట్లు అంచనా.

చిగురిస్తున్న ఆశలు

ప్రస్తుతం తెల్ల చేప ధర కిలో రూ.115, రూప్‌చంద్ రూ.90కు పెరగడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఐదారు నెలలుగా చేప పిల్ల కొనేవారు లేకపోవడంతో చేప పిల్లల పెంపకందారులు కూడా నష్టపోయారు. ప్రస్తుతం చేప ధర పెరగడంతో చేపల సాగు పుంజుకుని చేప పిల్లకు ధర పెరుగుతుందని ఆశిస్తున్నారు.

తగ్గిన చెరువుల లీజు

కొన్నేళ్లుగా చేపల చెరువుల లీజులు ఆకాశాన్నంటాయి. ఎకరానికి లీజు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకూ పలికింది. కొన్ని గ్రామాలలో లీజు ధర రూ.1.50 లక్షల వరకూ వెళ్లింది. అయినా చెరువులు దొరకని పరిస్థితి. ఏడాది కాలంగా ధర లేకపోవడంతో ఎకరం చెరువు లీజు రూ.60 వేల నుంచి రూ.75 వేలకు తగ్గింది. గత ప్రభుత్వం ఆక్వాకు విద్యుత్ యూనిట్ రూ.1.50కు ఇవ్వడం రైతులను కొంత ఆదుకుంది.

కిలో రూ.120 ఉంటే తప్ప గిట్టుబాటు కాదు



చేప ధర కిలో రూ.120 ఉంటే తప్ప రైతుకు ఏ మాత్రం గిట్టుబాటు కాదు. చేప కిలో సైజుకు పెంచడానికి సుమారు రూ.100 నుంచి రూ.105 వరకూ ఖర్చు అవుతుంది. ఇటీవల తెల్ల చేప కిలో రూ.90కు పడిపోవడంతో రైతులు దారుణంగా నష్టపోయారు. ఇప్పుడు చేప ధర పెరగడంతో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. కనీసం కిలో తెల్లచేప రూ.120 ఉండేలా ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.

సంకు శ్రీనివాసరావు, ఆక్వా రైతు

నారుమళ్ల రక్షణకు శాస్త్రవేత్తల సూచనలు


ఉప్పలూరులో సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఉండి: ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న అధిక వర్షాలకు నీట మునిగిన నారుమళ్లను సోమవారం కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప్పలూరు, చిలుకూరు గ్రామాల్లో నీట మునిగిన నారుమళ్లను పరిశీలించి ఆయా గ్రామాల రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పీ వినయలక్ష్మీ, బీ రజిత మాట్లాడుతూ వరి విత్తనం 3 రోజుల కంటే ఎక్కువగా నీటిలో ఉంటే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో త్వరగా నీటిని బయటకు తీసి నారుమడి గాలిపోసుకునేలా చేస్తే ఎలాంటి నష్టం ఉండదన్నారు. నీట మునిగిన నారుమడిలో నీరు తొలగించిన తరువాత 2 కిలోల యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడంతో ఆకులు వచ్చి నారు ఏపుగా పెరిగి నాట్లు వేసేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఎదుగుతున్న నారుమడి నీట మునిగితే నారుమడి తెగుళ్ల బారిన పడకుండా నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత లీటరు నీటికి గ్రాము కార్బండిజమ్ లేదా మాంకోజెబ్ మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. పిలక దశలో ఉన్న వరిపొలం ముంపునకు గురైతే నీటిని పూర్తిగా తీసివేసిన తరువాత పైపాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ కలిపి చల్లుకోవాలని తెలిపారు.

స్విమ్మింగ్ చాంపియన్లకు కలెక్టర్ అభినందన



స్విమ్మింగ్ పోటీల విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): కర్నూలులో జరిగిన 9వ సబ్ జూనియర్, జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు పొందిన స్విమ్మింగ్ క్రీడాకారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి అభినందించారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ బి.లావణ్యవేణిలను విజేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శనతో మరిన్ని పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడాకారుల వెంట డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు, జిల్లా స్విమ్మింగ్ అసోషియేషన్ సెక్రటరీ ఐ.మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు. సబ్ జూనియర్ స్విమ్మింగ్‌లో డి.స్వామినాయుడు 5 బంగారు పతకాలు గెలుచుకున్నాడు. జూనియర్ విభాగంలో బి.ధనుష్ సాయి రెండు బంగారు పతకాలు గెలుచుకోగా, పి.రఘురాం రెండు కాంస్య పతకాలు, సబ్ జూనియర్ విభాగంలో సిద్ధ మూడు విభాగాల్లో రజత పతకాలు, ఒక విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. జూనియర్ 1500 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సీహెచ్ పూర్ణి, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో జె.యశస్విని, 100 మీటర్ల బటర్ ఫ్లైలో పి.శ్రాగ్విత రజతాల్ని గెలుచుకున్నారు.

ఆదమరిస్తే షాకే!

వర్షాకాలంలో కరెంటుతో అప్రమత్తం


ఇనుప బాక్సులతో జాగ్రత్త



తెగిపడిన తీగలకు 35 మీటర్ల దూరం తప్పనిసరి

గత నెల 27న ఆగిరిపల్లి మండలం ఈదరలో బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌తో తల్లీకొడుకు ప్రాణాలు కోల్పోయారు. దీంతో వారి కుటుంబంలో విషాదం అంతాఇంతా కాదు. విద్యుత్ విషయంలో మన నిర్లక్ష్యం ప్రాణాల మీదకు తేవడమే కాకుండా మనల్ని నమ్ముకున్న వారికి తీరని శోకం మిగులుస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో రైతులు విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పొలాల్లో ఆరుబయట ఉన్న స్విచ్‌బోర్డులు తడిచి ఉండటంతో పాటు, తడి చేతులతో స్విచ్‌లు వేయడం వల్ల విద్యుత్‌షాక్‌కు గురవుతున్నారు. తెగిపడిన తీగలతో జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

–నూజివీడు

35 అడుగుల దూరం తప్పనిసరి

వేసవిలో ఈదురుగాలులకు ఊరి బయట పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడతాయి. వాటిని వర్షాకాలం వచ్చే వరకు పట్టించుకోరు. ఈ లోపు వర్షం పడి నీళ్లు నిలిచిఉంటే కరెంటు తీగలు ఆ నీళ్లల్లో ఉండటం వల్ల అందులోకి దిగితే విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. పొలాల్లో స్టార్టర్ నుంచి బోరు వరకు తీసుకెళ్లే వైర్లను, విద్యుత్ స్తంభం నుంచి బోరు వరకు ఉండే వైర్లను నేలపైన ఉంచుతారు. దీనివల్ల వైర్లు రాపిడికి గురై పైన ఉండే ఇన్సులేషన్ పోతుంది. విద్యుత్ స్తంభాలకు కూడా దూరంగా ఉండాలి. వర్షం వచ్చే సమయంలో ఇనుప విద్యుత్ స్తంభాలను అసలు పట్టుకోకూడదు. దీనివల్ల కూడా వర్షం వచ్చిన సమయంలో షాక్‌కు గురవుతారు. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు వర్షాకాలంలో కనీసం 35 అడుగుల దూరంలో ఉండాలి.

ప్లాస్టిక్ బాక్సులు ఉపయోగించాలి

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు గతంలో రైతులు స్టార్టర్ బాక్సుకు ఇనుప బాక్సులు ఉపయోగించేవారు. విద్యుత్ తీగలు తెగి అవి ఇనుప బాక్సుకు ఆనుకుంటాయి. దీంతో బాక్సును అంటుకోగానే రైతులు షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడు ప్లాస్టిక్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. ఇనుప బాక్సుల స్థానంలో ఏర్పాటు చేసుకోవాలి. గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు పోతే లైన్‌మెన్ గాని, అసిస్టెంట్ లైన్‌మెన్ గాని వచ్చే వరకు రైతులు ఓపికపట్టరు. ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌ను పిలవడమో, లేకపోతే తామే ఫీజు వేయడమో చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కచ్చితంగా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందజేయాలి. ఇంటి వద్ద ఉండే విద్యుత్ మీటర్ల వద్ద గాని, వ్యవసాయ భూముల్లోని స్టార్టర్ బాక్సుల వద్ద గాని ఎర్త్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.

కనీస జాగ్రత్తలు పాటించాలి



ప్రజలు వర్షాకాలంలో కనీస జాగ్రత్తలు పాటిస్తే విద్యుత్ షాక్‌లకు దూరంగా ఉండొచ్చు. కిందపడి ఉన్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలి. ఎర్త్‌లు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. రబ్బరు గ్లౌజులు వాడటం మేలు.

ఎ.సత్యనారాయణ, ట్రాన్స్‌కో ఈఈ, నూజివీడు

బీచ్‌లో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

నరసాపురం రూరల్: పేరుపాలెం బీచ్‌లో ఆదివారం గల్లంతైన పాటి హనుమ(18) మృతదేహం సోమవారం లభ్యమైందని ఏఎస్సై రాజేందర్ తెలిపారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన హనుమంతు మరో ఐదుగురు మిత్రులతో కలసి ఆదివారం మధ్యాహ్నం పేరుపాలెం బీచ్‌కు వచ్చి సరదాగా గడిపారు. స్నానం చేసేందుకు వీరంతా సముద్రంలో దిగారు. అలల ఉధృతికి హనుమంతు గల్లంతయ్యాడు. ఆదివారం రాత్రి వరకు ప్రయత్నించినా మృతదేహం లభ్యం కాలేదు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతైన ప్రాంతం నుంచి నరసాపురం మండలం పెదమైనవానిలంక వెళ్లే మార్గంలో మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. మృతదేహానికి నరసాపురం ప్రభుత్వాసుపత్రిలో పంచనామా నిర్వహించారు. మృతుడి స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యూటన్


యేలేటి న్యూటన్, అడపా ప్రసన్న కుమార్‌లను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యేలేటి న్యూటన్ ఎన్నికయ్యారు. పట్టణంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా అడపా ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షుడిగా కంచిరాజు వెంకట్రావు, స్పోర్ట్స్ కార్యదర్శిగా రేలంగి హరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బండారు శ్యామల, చంద్రశేఖర్‌బాబు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక అయ్యప్ప టౌన్‌షిప్‌లో పులసం విజయ్ ఇంట్లో జరిగిన చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. కుమార్తె ఆరోగ్యం బాగుండకపోవడంతో ఈ నెల 9న ఆయన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. సోమవారం వచ్చి చూసేసరికి తాళం పగులకొట్టి ఉండడం గమనించాడు. లోపలికి వెళ్లే చూసేసరికి లాకర్‌లో ఉన్న బంగారు వస్తువులు, వెండి పట్టీలు, కొంత నగదు చోరీకి చేసినట్లు గుర్తించాడు.

సాక్షి క్లాసిఫైడ్స్



GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299



■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185353]



■ కష్టమైన్స్ కాదుVIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ: 15000-40000,ఫ్రీరూం+భోజనం.HYD.7993583999 [HA-354]

■ భీమవరంలో చిన్న కిరాణా షాప్‌లో పని చేయుటకు వర్కర్స్ కావలెను. అనుభవం గల వారికి ఎక్కువ, అనుభవం లేని వారికి 8000. టైమింగ్స్ : 9 AM to 8.30 PM. Ph : 9849887842 [M-796181]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14404]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉచిత ఇసుకపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్


జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): ఉచిత ఇసుక విధానంపై ఫిర్యాదుల కోసం మైన్స్ ఏడీ కార్యాలయంలో జిల్లా స్థాయి కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 1800-425-6025 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక గోదావరి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతంలో ఇసుక డీసిల్టింగ్ కోసం నీటిపారుదల శాఖ సీఈ నుంచి సాధ్యాసాధ్యాల నివేదిక పొందాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్రమ, అనధికారిక తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని, నిరోధించేందుకు జరిమానాలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. భూగర్భ జల నిర్మాణాలు, వంతెనలు, డ్యామ్‌లు, రైల్వే లైన్ల నుంచి 500 మీటర్ల లోపల తవ్వకాలకు పాల్పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఆర్డీఓలు, పోలీస్, సెబ్, మైనింగ్ డిపార్ట్‌మెంట్, జిల్లా పంచాయతీ ఈ విషయంలో సమన్వయంతో పనిచేయాలన్నారు. మైన్స్ విభాగం ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. సరైన రసీదు లేకుండా ఇసుక రవాణ జరుగకుండా చూడాలని, సొంతిళ్ల నిర్మాణాల కోసం ఇసుక తీసుకువెళ్లే ప్రజలను ఎలాంటి ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, పంచాయితీ అధికారి తూతిక విశ్వనాథ్, సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎస్.సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి దూకి యువకుడి ఆత్మహత్య


మేడిచర్ల రవితేజ (ఫైల్)

యలమంచిలి: మొగల్తూరు గ్రామానికి చెందిన మేడిచర్ల రవితేజ(22) చించినాడ వద్ద వశిష్ట గోదావరి నది వంతెన మీద నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. మొగల్తూరు హైస్కూల్ ప్రాంతానికి చెందిన రవితేజ శనివారం సాయంత్రం బైక్, పాదరక్షలు వంతెన మీద వదిలేసి గోదావరిలో దూకాడు. అతని కోసం గాలిస్తుండగా వంతెన సమీపంలో సోమవారం ఉదయం రవితేజ మృతదేహం కనిపించడంతో పైకి తీశారు. మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి బాబాయి శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విజయం దక్కేవరకూ పోరాడాలి


నూజివీడు డీఎస్పీ లక్ష్మయ్యను సత్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు

నూజివీడు: ప్రతి వ్యక్తి విజయతీరాలను చేరుకోవాలంటే కష్టాలను దాటుకుంటూ వెళ్లాల్సిందేనని నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో విద్యార్థులతో సోమవారం ఆయన ముచ్చటించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి విజయవంతమైన వ్యక్తి ఎన్నో ప్రతికూలతలు ఎదుర్కొని ఆ స్థాయికి చేరుకున్నారన్నారు. చిన్న చిన్న కష్టాలకే భయపడకూడదని, కష్టాలు లేని జీవితమే ఉండదన్న వాస్తవాన్ని ప్రతి విద్యార్థి గమనించాలన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని, విఫలమైతే మళ్లీ ప్రయత్నించాలే గాని వదిలేయకూడదన్నారు.అనంతరం పీయూసీ ఇన్‌చార్జి దుర్గాబాబు, అసోసియేట్ డీన్ అకడమిక్స్ జ్యోతిలాల్ నాయక్‌లు గోలి లక్ష్మయ్యను శాలువాతో సత్కరించారు.

గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి ఎస్.భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో మొత్తం 12 పోస్టులున్నాయని చెప్పారు. లెక్కలు–5, సోషల్–1, బోటనీ–1, ఇంగ్లీషు–1, హిందీ–1, హెల్త్ సూపర్‌వైజర్–1, పీఈటీ–2 పోస్టులకు పురుష అభ్యర్థుల దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మహిళా అభ్యర్థులకు సంబంధించి హిందీ–1, బోటనీ–1, జువాలజీ–1, ఇంగ్లీషు–2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ధ్రువపత్రాల జిరాక్స్‌తో దరఖాస్తుల్ని జిల్లా సమన్వయ అధికారి, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఏలూరు చిరునామకు ఈ నెల 18లోగా సమర్పించాలన్నారు.

Bank of Baroda | బ్యాంక్ ఆఫ్ బరోడా

కెనాల్ రోడ్డు బ్రాంచ్ ఏలూరు, డి.నెం.36-1-25, విజయ గ్యాస్ గొడౌన్ దగ్గర, కెనాల్ రోడ్డు, ఏలూరు, ఆంధ్రప్రదేశ్ - 534001 (ఫోన్:08812-230896)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క 8 (6) రూలు SARFAESI చట్టం 2002 నందు నిర్ధారించిన పరిధిలో 30 రోజుల నోటీసు.

బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనాల్ రోడ్డు బ్రాంచ్ ఏలూరు [illegible]

[illegible]

ఋణగ్రహీత/హామీదారు వివరములు : ఋణగ్రహీత: మెస్సర్స్ శ్రీ కృష్ణ సీ ఫుడ్స్ [illegible] 2. శ్రీమతి కుంచే శ్రీ లక్ష్మి [illegible] ఆంధ్రప్రదేశ్ – 520013 (ఓవర్ డ్రాఫ్ట్ అకౌంట్ నెం.75410400000298)

డిమాండ్ నోటీసు తేది	స్వాధీనత నోటీసు తేది	స్వాధీన నోటీసు ప్రచురించిన తేది	రూల్ 8(6) నోటీసు
24.08.2023	24.11.2023	28-11-2023	తేది:09-07-2024

చెల్లించవలసిన మొత్తం: తేది.07-07-2024 నాటికి రూ.6,42,33,210.72/- [illegible] + తేది.08-07-2024 నుండి వర్తింపచేయని వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో సహా.

ఆస్తుల వివరములు:

[illegible]

తేది : 15-07-2024 | ప్రదేశం : ఏలూరు | సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

నిరుద్యోగుల ఆశలు నెరవేరేనా..!

- నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపులు
- ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- మోసం చేస్తారేమోనని ఆందోళన



తాడేపల్లిగూడెం(టీఓసీ)/తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు: ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగభృతి అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రజలను ఎన్నికల హామీలో నమ్మబలికింది. తద్వారా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల గడిచిపోయింది. ఎన్నికల సమయంలో తెదేపా అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు ప్రజలకు ఇచ్చిన హామీలు పక్కనపెట్టి శ్వేతపత్రాలంటూ హడావుడి చేస్తుంటే తమకిచ్చిన హామీల సంగతేంటని పలు వర్గాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ప్రతి ఇంటికి ఉద్యోగం కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల హామీలో ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొన్నారు. కాగా ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిపై విధివిధానాలు ప్రకటించక పోవడంతో పలువురు నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో లాగా చంద్రబాబు మరోమారు మోసం చేస్తారేమోనని వాపోతున్నారు. తాడేపల్లిగూడెం పట్టణం, రూరల్, పెంటపాడు తదితర మండలాల్లో అధికశాతం గ్రాడ్యుయేట్‌లు ఉన్నారు. అయితే వారు ప్రస్తుతం సరైన ఉద్యోగాలు లేక కూలీ పనులు, బిల్డింగ్‌లో లేబర్ కార్మికులుగా పని చేసుకొంటున్నారు. మరి కొంతమంది చదువే ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని పోటీ పరీక్షల ద్వారా ఏదోలా ఉద్యోగం సాధించాలని కోచింగ్ సెంటర్‌లు, పుస్తకాలు కొనుగోలు, ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. వీరిలో ప్రధానంగా డిగ్రీ, పాలిటెక్నిక్, పీజీ, బీఈడీ చేసిన వారే ఉండటం విశేషం. మరి కొంతమంది తమ చదువుకు తగ్గ ఉద్యోగాలు రావని నిర్ణయం తీసుకొని తల్లిదండ్రుల పోషణ నిమిత్తం వారికి ఆసరాగా నిలవడం కోసం, కుటుంబం పోషణకు పలు దుకాణాల్లో అరకొర జీతాలకు పనిచేస్తున్నారు. ఇటువంటి వారంతా చంద్రబాబు ఇచ్చిన హామీతో సరైన కొలువు వస్తుందని ఎంతో ఆశగా ఉన్నారు. ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకొని నిరుద్యోగులను ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ భృతి విషయంలో చంద్రబాబు నాయుడుతో పాటు, అండగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని నిరుద్యోగులు పేర్కొంటున్నారు. తక్షణం నిరుద్యోగ భృతి ఇచ్చి తక్షణం ప్రజలను ఆదుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు.

గతంలో మాట ఇచ్చి తప్పారు



గతంలో చంద్రబాబు నిరుద్యోగ భృతి రూ.2 వేలు ఇస్తానని మాట తప్పారు. ఎన్నికల హామీలో భాగంగా భృతి రూ. 3 వేలు ఇస్తామని నేడు హామీ ఇచ్చారు. చదువుకున్న మాకు ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఇచ్చిన హామీ మేరకు ఆంక్షలు విధించకుండా అమలు చేయాలి.

– ఎ.త్రినాథ్, నిరుద్యోగి, తాడేపల్లిగూడెం

ఉద్యోగం ఊసే లేదు



కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇంటికో ఉద్యోగం, లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశగా కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో నిరుద్యోగుల ఆశలు అడియాశలుగా మారాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– రాంకూరి జాన్, బీకాం, కుంచనపల్లి, తాడేపల్లిగూడెం మండలం

కుటుంబ పోషణ కష్టంగా ఉంది



నేను గ్రాడ్యుయేషన్‌తో పాటు టీచర్ ట్రైనింగ్ చేస్తున్నాను. ఉద్యోగం లేక కుటుంబ పోషణ కష్టంగా ఉంది. గతంలో మాదిరి కాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇవ్వటంతో పాటు, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి.

– కె. జాన్ విజయ్, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయం



భవిత సెంటర్‌లో విద్యార్థులకు స్టేషనరీ, కుర్చీలు అందజేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ సభ్యుల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ కోడే వెంకట్రావు 101 జయంతి సందర్భంగా డైమండ్స్ మానేపల్లి సునీల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 5వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు కోసం కుర్చీలు, పౌష్టికాహారం, బాలింతలకు కుర్చీలు పంపిణీ చేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డిచే భవిత విద్యార్థులకు స్టేషనరీ అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రజా వైద్యులు కోడే వెంకట్రావు సేవలు మరవలేనివి అన్నారు. ఈ కార్యక్రమంలో కుందుం వెంకటేశ్వరరావు, చిక్కాల అంబికా, ప్రియాంక, జామి సత్యనారాయణ, బాలీశ్వరయ్య, సత్యవతి, రత్నకుమారి, నాగలక్ష్మి, సిబ్బంది భవిత విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



విద్యాప్రవేశ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో టీవీ రామకృష్ణ

పెంటపాడు: మండలంలో సోమవారం విద్యా ప్రవేశ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని మండల విద్యాశాఖాధికారి టీవీ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ఈ విద్యా ర్యాలీ ఆవశ్యకతను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దర్శిపర్రు గ్రామంలోని మూడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు, ఉపాధ్యాయులు కేవీఎస్ నారాయణ, రమణ, డీవీ రామకృష్ణ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వరి చేలను పరిశీలించిన ఏడీఏ



నవాబుపాలెం నీట మునిగి వరి నాట్లను పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం, నందమూరు, ఆరుళ్ల, జగన్నాథపురం, దండగర్ర, మోదుగ గుంట గ్రామాలను సోమవారం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ ఐదు హెక్టార్లలో నారుమడి, 209 హెక్టార్లలో నాట్లు నీట మునిగాయన్నారు. రాబోయే రెండు రోజులు వర్షాలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్‌లు స్నేహ, ఆంజనేయులు, ప్రసాద్, దుర్గ, సతీష్, నాయకులు ధనరాజ్, పిల్లా రాంబాబు, శనగన రాంబాబు, ఉండ్రాజవరపు రాజు, సాల్మన్‌రాజు, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నారుమడుల్లో వర్షపు నీటిని తొలగించాలి



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

పెంటపాడు: నారుమడులలో వర్షపు నీటిని బయటకు తొలగించాలని ఏడీఏ మురళీకృష్ణ, ఏవో సారథిలు రైతులకు సూచనలు చేశారు. మండలంలో పలు గ్రామాల్లో వర్షం వల్ల దెబ్బతిన్న నారుమడులను సోమవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. మండలంలో బి.కొండేపాడు, విప్పర్రు, కె.పెంటపాడు, మీనవిల్లూరు తదితర గ్రామా ల్లో 183 ఎకరాలకు సంబంధించిన నారుమడులు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాలకు నారుమడుల చుట్టూ గట్లు ఎత్తుగా ఉండేటట్లు చేయాలన్నారు. మడుల్లో వర్షపు నీటిని తొలగించి, నారుపై రెండు గ్రాముల కార్బన్‌డిజం లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

నేడు అవగాహన సదస్సు

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పెనుగొండ మండల అధ్యక్ష కార్యదర్శులు డాకర్ ఎస్.వి జయరాజు, షేక్ మస్తాన్‌లు తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు డెస్క్‌టాప్ కంప్యూటర్, ప్రోత్సాహక బహుమతులు అందిస్తారన్నారు.

162 మందికి ఉచిత వైద్య సేవలు



మందులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం, జనతా చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక తాళ్లముదునూరుపాడులో డాక్టర్ పీఎస్‌మూర్తి మెమోరియల్ పీఎంసీ సేవా సదన్ హాల్‌లో రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ వైద్యులచే మెగా ఉచిత వైద్య శిబిరం జరిగింది. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, దాత మదన్ మోహన్ అగర్వాల్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. 162 మందికి ఉచితంగా ఈసీజీ, ఎకో టెస్ట్, స్త్రీల వ్యాధులు, దంత వైద్యం, కంటి వైదం, చెవి, ముక్కు, గొంతు, ఎముకుల వ్యాధులకు సంబంధించి వైద్యులు పలువురికి పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం 18 మందిని రాజానగరం తరలించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, లక్ష్మీపతి, రామమోహన్‌రావు, కాశయ్య, సూర్యనారాయణ మూర్తి, గ్రంధి సత్యనారాయణ, మహేశ్వరరావు, రామకృష్ణ, సూర్యదేవ్, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

మైనర్.. నో రయ్ రయ్..

- అమల్లోకి కొత్త వాహన చట్టం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



తణుకులో మైనర్లకు అవగాహన కల్పిస్తున్న తణుకు సీఐ నాగరాజు

తణుకు: గతంలో వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిచ్చినపుడు ప్రమాదాలకు గురైతే రూ.1000 జరిమానా విధించారు. నేరం నిరూపితమయ్యే వరకు జువైనల్ కోర్టుకు బాలుడు ప్రతి శుక్రవారం హాజరయ్యే ప్రక్రియ ఉండేది. బాధితుల తరపున వారు.. బాలుడి తరపున వారు మాట్లాడుకునే వెసలుబాటును బట్టి ఉండేది. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి గతంలో రూ.2 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష ఉండేది ఇది గతం.

సవరించిన చట్టం ప్రకారం..

నూతన సవరించిన వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిస్తే ఆ బండి ఎవరి పేరిట ఉంటే (తల్లిదండ్రులు, సంరక్షకులకు) రూ. 25 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. తాజాగా సవరించిన చట్టం ప్రకారం మద్యం తాగి వాహనాలు నడిపేవారికి రూ. 10వేల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుంది. ఇటీవల జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి. రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ నిండు ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న మైనర్లు బైక్ నడపకుండా చెక్ పెట్టింది. వయస్సు అనుమతి లేకపోయినా రయ్ మంటూ పోనిస్తూ పాదచారులు, వాహదారులను వణికిస్తున్న వారిని హెచ్చరిస్తూ వాహన చట్టం సవరించి జూన్ ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చింది. రహదారిపై సురక్షిత ప్రయాణం ఉండాలనే సంకల్పంతో ఈ చట్ట సవరణకు ఆమోదం తెలిపింది.

వాహన చట్టానికి సవరణ

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న వాహన చట్టంలో కొన్ని మార్పులు తెచ్చింది. 2019 సెప్టెంబర్, 01న నూతన చట్టం అమల్లోకి తెచ్చి.. వాహనదారులకు విధించే జరిమానాల్లోనూ భారీ మార్పులు తెచ్చింది. అయినప్పటికీ మైనర్లు బైక్ నడుపుతూ అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. మందుబాబులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఈ మధ్య జరిగిన ఎన్నో రోడ్డు ప్రమాదాలే ఇందుకు సాక్షి. ఇకపై వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా జూన్ 1 నుంచి కొత్త వాహన చట్టాన్ని అమలులోకి వచ్చింది.

నిబంధనలు పాటించాల్సిందే

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిందేనని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రాణం చాలా విలువైందని కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా.. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగులుతుండడంతో లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు సంకేతాలు పాటించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వావానాలను నడపరాదని, కార్లలో సీట్ బెల్ట్ తప్పనిసరి అని పోలీసులు సూచిస్తున్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో డీఆర్‌జీకి ర్యాంకుల పంట



విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు

పెంటపాడు: ఇటీవల విడుదలైన ఏపీ పీజీసెట్ ఫలితాల్లో పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకుల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రాంగణంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు అధ్యాపకులు వారిని ప్రత్యేకంగా అభినందించారు. పీజీ తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయిలో పలువురు ర్యాంకులు సాధించారన్నారు. వీరు యూనివర్సిటీలో చదువుకొనేందుకు అర్హత సాధిస్తారన్నారు. సీహెచ్ దుర్గాభవాని(15వ ర్యాంకు), దారం అలేఖ్య(58వ ర్యాంకు), జె. పావని, బి.మహిమశాంతి, కె. సుమలు వరుసగా 291,301,304 ర్యాంకులు సాధించారని ప్రసాద్ తెలిపారు. కళాశాల తెలుగు విభాగాధిపతిలు డాక్టర్ శంకర్ గోపాల్, పి. రామచంద్రుడు తదితరులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి



భీమవరంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీతో కలిసి చురుగ్గా పాల్గొన్నారని ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రాజెక్ట్ కన్వీనర్ గంధం శ్రీదేవి అన్నారు. జిల్లా సర్వోదయమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో సోమవారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని నిర్వహించి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుర్గాబాయి దేశ్‌ముఖ్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జన్మించారని, భారత రాజ్యాంగ సభలో ఆమె సభ్యురాలిగా ఉన్నారన్నారు. విద్యా శిక్షణ, నిరుపేద మహిళలు, పిల్లలు, వికలాంగుల కోసం నిరంతరం పాటుపడ్డారని కొనియాడారు. అనంతరం ఉపాధ్యాయులు గంధం శ్రీదేవి, కె.మాధవిలత, సునీత, వారణాసి రాధాకృష్ణలను అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సత్కరించారు. సర్వోదయ మండలి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం, కలిగొట్ల గోపాలశర్మ, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

సంఘ సంస్కర్త, రచయిత్రి దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా సోమవారం విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 18వ వార్డులో పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

సమస్యలు సత్వరమే పరిష్కరిస్తాం



వినతుల స్వీకరణ కార్యక్రమంలో కమిషనర్ మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. సోమవారం మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కుళాయి రిపేర్లు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, డ్రెయిన్ల పరిశుభ్రత, సిల్టు తీయుట, ఫాగింగ్ వంటి సమస్యలపై వినతులు అందుతున్నాయన్నారు. డ్రెయిన్ల మరమ్మతులు, మురుగునీటి ప్రవాహం వంటి రెండు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. అసిస్టెంటు కమిషనర్ గోపాలరావు, మేనేజర్ యం.రవిసుధాకర్ , రెవిన్యూ ఆఫీసర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. గత వారం వచ్చిన సమస్యలను పరిష్కరించామన్నారు.

కచ్చా డ్రెయిను ఏర్పాట్లు

కడకట్ల 32వ వార్డు బ్రేక్ ఇనస్పెక్టర్ కార్యాలయం వెనుక వీధిలో వర్షం నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి. మునిసిపల్ అధికారులు కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేసి రహదారి వేశారు.

వడ్డి రఘురాం నాయుడును కలిసిన విద్యార్థి సంఘం నాయకులు



వడ్డి రఘురాం నాయుడుతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏవీఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి నాయకులు స్టేట్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పాలూరి శివ, స్టేట్ జనరల్ సెక్రటరీ శంకర్‌రెడ్డి, మహంతీర్‌లు సోమవారం పట్టణంలోని మాజీ వైఎస్సార్ సీపీ ఏపీ ఆక్వా కల్చర్ డెవలెప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా రంగం తదితర అంశాలపై చర్చించారు.

జలదిగ్బంధంలో రామలింగేశ్వరుడు



రామలింగేశ్వరస్వామి ఆలయంలోకి చేరిన నీరు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలోని గోస్తనీ డ్రెయిన్ పొంగి ప్రవహిస్తుండటంతో నత్తారామేశ్వరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం జల దిగ్బంధంలో చిక్కుకుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి జలాలను గోస్తనీ పంట కాలువ ద్వారా వేల్పూరు వద్ద గోస్తనీ డ్రెయిన్‌లోకి మళ్లించడంతో ఈ ముంపు సమస్య మరింత ఎక్కువయ్యింది. గోస్తనీ డ్రెయిన్‌లో కిక్కిస చెత్త పేరుకుపోవడంతో దిగువకు మురుగు నీరు ప్రవహించకపోవడంతో పెనుమంట్ర మండలంలోని నాట్లు వేసిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అంతే కాకుండా పుణ్యక్షేత్రాల ఆవరణలో కూడా నీరు నిలిచిపోవడంతో స్వామివారి నిత్య పూజలకు కొంత అంతరాయం ఏర్పడుతుంది.

అధ్వానంగా కోళ్లపర్రు రోడ్డు



గోతులమయంగా మారిన కోళ్లపర్రు ప్రధాన రహదారి

ఆకివీడు: మండలంలో మేజర్ పంచాయతీ కోళ్లపర్రు గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. గ్రామంలోకి వెళ్లే రహదారి ప్రాంతానికి చేర్చి చేపల చెరువు గట్లు వేయడంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు ధ్వంసమవుతోంది. దుక్కి వర్షపు నీటికి రహదారిపై నీరు నిలిచిపోతోంది. వర్షపు నీరు, మురుగు నీరు బయటకు పోయేందుకు మార్గం లేక ముంపు నీటిలోనే వాహనాల రాకపోకలతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారికిరువైపులా కచ్చా డ్రెయిన్లు తవ్వించి, మురుగునీటిని మళ్లించేలా పంచాయతీ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. సిద్ధాపురం గ్రామం నుంచి రాజులపేట మీదుగా కోళ్లపర్రు గ్రామం నుంచి కలవపూడి–గణపవరం ప్రధాన రహదారికి అనుసంధానం అవుతోంది. దీంతో ఈ రహదారిపై చేపలు, రొయ్యల వ్యాన్లు, లారీలు, మేత లోడు లారీలు నిత్యం అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో రహదారి మరింతగా ధ్వంసమవుతోందని స్థానికులు వాపోతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలకు రహదారి పూర్తిగా పాడై గుంతలతో నిండుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి కోళ్లపర్రు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి హోమం



వారాహి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం మెంటేవారితోటలోని శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా సోమవారం వారాహి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో యామిజాల కృష్ణ శర్మ, ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌లు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వారాహి నవరాత్రులు ముగింపుసందర్భంగా వేదమంత్రాలతో వారాహి హోమా న్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని, హోమాన్ని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేరూరు ఘటనపై ప్రభుత్వం స్పందించాలి

భీమవరం: కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్న పేరూరు గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన కదిరి ప్రభాకర్‌పై అగ్రవర్గ దురహంకారులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ చెప్పారు. సోమవారం భీమవరంలో మాలమహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బంధువు మృతితో ఖనన కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళుతున్న ప్రభాకర్ నీరసంతో కాసేపు విశ్రాంతి కోసం అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి ఇంటి అరుగుపై కూర్చోవడంతో వేడినూనె వేసి గాయపర్చడమేగాక కులం పేరుతో దుర్భాషలాడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, బాధితుడికి వైద్య నిమిత్తం ప్రభుత్వం స్పందించాలని పుష్పరాజ్ డిమాండ్ చేశారు. అనంతరం భీమవరం మండల మాలమహానాడు కార్యదర్శిగా సాదే ప్రసాద్, సహాయ కార్యదర్శిగా వర్దనపు తేజను నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణ రాజు, భాగ్యరాజ్, వినోద్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

చెరువుపై ఆక్రమణలు తొలగించాలని వినతి

పాలకోడేరు: వేండ్ర గ్రామంలోని సంతమార్కెట్ వద్ద గల కొండాయ చెరువుపై ఆక్రమణలను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. చెరువు చుట్టుపక్కల వారు తమ ఇళ్లల్లో నుంచి మురుగునీరు, గృహాల్లోని వ్యర్థాలు వేస్తూ చెరువు నీటిని కలుషితం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395

తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com